వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
బుధవారం, ఆగస్టు 26, 2026

# వచ్చే పదిహేను రోజులు బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి

• జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందేభారత్ :** ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా రానున్న పదిహేను రోజులు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అత్యంత అప్రమత్తంగా పనిచేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. వారి ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో సంగారెడ్డి నియోజకవర్గ బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు మరియు ముఖ్య నాయకుల కోసం ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో వెన్నెల గద్దర్, ప్రీతం, దయాకర్, చైతన్యలు పాల్గొని ఎస్ఐఆర్ విధివిధానాలపై బీఎల్ఏలకు సమగ్ర అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితాలోని





ఆబ్సెంట్, షిఫ్టింగ్, డెత్, డూప్లికేట్ (ఏఎస్ డీడీ) ఓట్లతో పాటు అనామలిస్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించి పునఃపరిశీలన చేయాలని ఆదేశించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో సుమారు 64 వేల ఓట్లపై స్పష్టత వచ్చే వరకు క్షేత్రస్థాయిలో శ్రమించాలని సూచించారు. రెండో దశ ఎస్ఐఆర్‌లో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ సభలకు బీఎల్ఏలు తప్పనిసరిగా హాజరుకావాలని, డెత్ లేదా ఆబ్సెంట్‌గా నమోదైన ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి వాస్తవాలు పరిశీలించాలని నిర్దేశించారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు అందని వారికి ఫారం-6 అందజేయాలని, ఇది ఓటర్ల జాబితా సవరణలో చివరి కీలక అవకాశమని భావించి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పెళ్లింట..ఇంటి ఆడబిడ్డగా మారిన కల్వకుంట్ల కవిత

◆ ఆకట్టుకున్న వివాహ వేడుక


**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రక్షణ సేన నాయకుడు, తెలంగాణ జాగృతి మాజీ కార్యకర్త బాషబోయిన బాలప్రసాద్ వివాహం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా అత్యంత వైభవంగా జరిగింది. తనకు అక్కాచెల్లెళ్లు లేకపోవడంతో తన వివాహం పార్టీ చీఫ్ కవిత చేతుల మీదుగా, ఇంటి ఆడబిడ్డ హోదాలో జరగాలని బాలప్రసాద్ కోరుకున్నారు. ఆయన ఆకాంక్షను మన్నించిన కవిత.. ముదిరాజ్ సంప్రదాయం ప్రకారం పెళ్లి తంతులో పాల్గొని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ వేడుక ఈసీఐఎల్ – కీసర క్రాస్ రోడ్డులోని ఆరాధ్య కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు గ్రామానికి చెందిన బాలప్రసాద్‌కు,





సీతాఫల్‌మండికి చెందిన శివానితో వివాహం నిశ్చయమైంది. ముదిరాజ్ కులాచారం ప్రకారం వరుడు తాళి కట్టే ముందు ఆడపడుచుతో పసుపు కొమ్ముతో మూడు ముళ్లు వేయించే ఆచారం ఉంది. ఈ ఆచారం మేరకు కల్వకుంట్ల కవిత గౌరీ పూజలో పాల్గొని, వధువు శివాని మెడలో పసుపు కొమ్ముదారంతో మూడు ముళ్లు వేశారు. ఉంగరపు వేలుకు ప్రదానపు ఉంగరం తొడిగి, ఒడిబియ్యం పోసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆ తర్వాతే వరుడు బాలప్రసాద్ వధువు మెడలో మంగళసూత్ర ధారణ చేశారు. ఈ వినూత్న మరియు భావోద్వేగభరిత వివాహ వేడుకలో వధువరుల తల్లిదండ్రులు స్వరూప – బాలకృష్ణ, సోదరుడు నాగరాజుతో పాటు తెలంగాణ రక్షణ సేన నాయకులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్త జంటను అభినందించారు.

# ఘనంగా రామప్ప జూనియర్, డిఫెన్స్ కాలేజీ ఫ్రెషర్స్ వేడుకలు



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** స్థానిక రామప్ప జూనియర్ & డిఫెన్స్ కాలేజీలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నిర్వహించిన "కార్వన్-26" ఫ్రెషర్స్ పార్టీ హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ వేడుకకు కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, డీవైఎస్ఓ ప్రశాంత్, జీకే మధు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల కరస్పాండెంట్ & డైరెక్టర్ ఐలి కర్ణాకర్, తేజస్వి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగుతూ, క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకోవాలని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి సూచించారు. చెడు అలవాట్లకు





దూరంగా ఉంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు క్రీడలు, వ్యక్తిత్వ వికాసం, శారీరక దృఢత్వం యువత ఉజ్వల భవిష్యత్తుకు ఎంతో అవసరమని డీవైఎస్ఓ ప్రశాంత్ పేర్కొన్నారు. 2016-17లో కేవలం 17 మంది విద్యార్థులతో ప్రారంభమైన కాలేజీ నేడు వేలాది మందికి మార్గదర్శకంగా నిలిచిందని డైరెక్టర్ కర్ణాకర్ తెలిపారు. హెచ్‌సీఎల్ సంస్థల్లో 450కి పైగా, రక్షణ రంగంలో 600లకు పైగా ఉద్యోగాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ అందించినట్లు వెల్లడించారు. సాంస్కృతిక ప్రదర్శనలు: విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, స్కిట్లు, పిరమిడ్స్ అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ప్రిన్సిపాల్ వినోద్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, రిటైర్డ్ ఆర్మీ ఫిజికల్ కోచ్ కమల్, జోనల్ మేనేజర్ పూర్ణచందర్ మరియు అధ్యాపక బృందం నుంచి రవి కుమార్, రాజు, గణేష్, అశోక్, విజయ్, దలైలామా, వెంకటరమణ, సుక్దేవ్, రామ్ మోహన్, అన్నారెడ్డి, సంతోష్, చిరపాటి రావు, చిరంజీవ రావు, రాజు, రాజేందర్ రెడ్డి, రంజిత్, అనూష రెడ్డి, గీత తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై వాహనాలు నిలపకుండా చూద్దాం.. ప్రమాదాలు నివారిద్దాం

## మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపు



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సూర్యాపేట జిల్లా దొరకుంట వద్ద తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నిద్రలోనే ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన 12 మందికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు. ఆగి ఉన్న వాహనాలను ఢీకొనడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని పిలుపునిచ్చారు. ఔటర్ రింగ్ రోడ్డు అయినా, నేషనల్ హైవే అయినా రోడ్డుపై ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి ఢీకొనడం వల్లే ఎక్కువ శాతం ప్రాణాంతక ప్రమాదాలు జరుగుతున్నాయని ఈటల ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపై వాహనాలు నిలపకుండా ఉండేందుకు కఠిన నిబంధనలు ఉన్నప్పటికీ డ్రైవర్లలో తీరు మారడం లేదని, నిర్దేశిత ప్రదేశాల్లోనే వాహనాలు ఆపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైవర్లకు దీనిపై మరింత అవగాహన కల్పించాలని, ఈ కార్యక్రమం ఒక క్యాంపెయిన్‌లా నిరంతరం జరగడానికి ప్రజల తోడ్పాటు కూడా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

# నిజామాబాద్ గడ్డపై 'పాంచజన్య సంకల్పం' సభ

**నిజామాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజల జీవితాల్లో మార్పు, అన్ని వర్గాలకు సమాన అవకాశాలే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో 'పాంచజన్య సంకల్ప సభ'ను ఘనంగా నిర్వహించనున్నారు. పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా నిజామాబాద్ జిల్లాకు వస్తున్న పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఈ సభలో పాల్గొని పాంచజన్య సంకల్పాన్ని ప్రజలకు వివరించనున్నారు. నిజామాబాద్‌తో కవితకు ఉన్న ప్రత్యేక అనుబంధానికి ఈ సభ మరో వేదిక కానుంది. ఆగస్టు 31న మధ్యాహ్నం 3 గంటలకు నిజామాబాద్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఈ బహిరంగ సభ జరగనుంది. సర్వోదయ తెలంగాణ సాధనే ధ్యేయంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ చారిత్రాత్మక సభకు ప్రజలు, యువత, రైతులు, మహిళలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సభ పర్యవేక్షకులు, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. రఘు కోరారు.

# శాంతి, ఐక్యతలే లక్ష్యం

## మిలాద్ ఉన్ నబీ పండుగ శుభాకాంక్షలు

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కృష్ణానగర్‌లో ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించిన మిలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు, ముస్లిం సోదరులకు ఆయన హృదయపూర్వక పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త బోధనల ఆచరణ: ప్రవక్త మహమ్మద్ చూపిన శాంతి, సోదరభావం, కరుణ మరియు మానవతా విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆకాంక్షించారు.మిలాద్-ఉన్-నబీ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఐక్యతను తీసుకురావాలని ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఆకాంక్షించారు.